RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: మల్లె నాగిరెడ్డి




ఎండల తీవ్రత మరింత పెరుగుదల




నష్టాల బాటలో స్టాక్ మార్కెట్లు

నల్గొండ హైదరాబాద్ సంపుటి : 4. సంచిక :251 బుధవారం 27 మే 2026 పేజీలు 8 వెల: రూ. 1.00 epaper.manasakshi.in



ఇంటింటి సర్వేతో

# 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

**రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహా స్థాయి డేటా సేకరణ జరపాలి.**

## సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు

## భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది.

## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

- తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే
- పోలీసులకు లొంగిన నరహరి,ధనమ్మ జంటకు చెక్కులు అందచేత
- గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి
- డిజిపి సివి ఆనంద్ పిలుపు







## వాహనదారులపై మళ్లీ పిడుగు

సిఎన్‌జి ధరలు పెంచిన కేంద్రం

వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు




## ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## దేశంలో అసహజ జనాభా మార్పు




ఉన్నతస్తాయి కమిటీ ఏర్పాటు

హోంమంత్రి అమిత్ షా వెల్లడి

అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు.




## తెలంగాణలో అవినీతి రాజ్యం

అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్

సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం

కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు.

# ధాన్యం కొనుగోలులో విఫలం

- ప్రతిపైసా కేంద్రమే ఇస్తున్నా...ఎందుకీ వైఫల్యం
- వడ్ల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తి మాత్రమే
- మధ్యవర్తిత్వం చేసినందుకు రాష్టానికి కేంద్రం కమిషన్ కూడా ఇస్తోంది
- ఇకనైనా బేషజాలకు పోకుండా ప్రతి గింజను కొనుగోలు చేయండి
- జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని రైతుల ఇబ్బందులను తీర్చండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన



**కరీంనగర్ మే 26, మనసాక్షి :**

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రమే ఇస్తున్నప్పటికీ, వడ్ల కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగావడం లేదని మండిపడ్డారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకే రైతు గోస బీజేపీ భరోసా పేరుతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం 1 కోటి 39 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం రెండో అంతస్తు నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. వీటితోపాటు కార్మిక ఆరోగ్య సంక్షేమ భవన పునరుద్ధరణ, షెడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. వడ్ల కొనుగోలు అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పై విధంగా స్పందించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రానివా? రాష్ట్రానివా? సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుతిలీతాడు మొదలు రవాణా ఖర్చులన్నీ కేంద్రమే ఇస్తోందన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి మాత్రమేనన్నారు. మధ్యవర్తిత్వం చేసినందుకు కేంద్రం రాష్టానికి కమీషన్ కూడా ఇస్తోందని తెలిపారు. అయినా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమవుతోందని విమర్శించారు. ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలన్నారు. పొరపాట్లు జరిగిన చోట గుర్తించి వెంటనే సరి చేసుకుని వడ్లను కొనుగోలు చేయాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు బీజేపీ రైతు గోస బీజేపీ భరోసా పేరుతో యాత్రలు చేస్తున్నామని తెలిపారు.

## వాహనదారులపై మళ్లీ పిడుగు



న్యూఢిల్లీ: కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు**



కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.?

## నష్టాల బాటలో స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ: లాభాల స్వీకరణ కారణంగా దేశీయ సూచీలు మంగళవారం నష్టాల బాట పట్టాయి. సోమవారం సూచీలు భారీ లాభాలు ఆర్జించిన నేపథ్యంలో గరిష్ఠాల వద్ద మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడం ప్రతికూలంగా మారింది. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి (95.68) బలహీనపడడం నెగిటివ్‌గా మారింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ రాజుకున్న నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలతో రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (76,488)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం దాదాపు 250 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత పైకి వచ్చింది. అయితే చివర్లో అమ్మకాల వల్ల సూచీలు మళ్లీ నష్టాల బాట పట్టాయి. చివరకు సెన్సెక్స్ 479 పాయింట్ల నష్టంతో 76,009 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 118 పాయింట్ల నష్టంతో 23,913 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో ఎక్సైడ్ ఇండస్ట్రీస్, అదానీ పవర్, ఇన్ఫో ఎడ్జ్, అదానీ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. కంటైనర్ కార్పొరేషన్, రైల్ వికాస్, కేన్స్ టెక్, టొరెంట్ ఫార్మా, అశోక్ లేలాండ్ మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 200 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ మాత్రం 332 పాయింట్లు ఆర్జించింది.

## శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

**ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి**


వాషింగ్టన్:అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు.

# తెలంగాణలో అవినీతి రాజ్యం



హైదరాబాద్: తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూముల ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమా÷–÷–లు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు



హైదరాబాద్: మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల



హైదరాబాద్:ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది.

రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

## యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం

## రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు

## మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్: యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.




## ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

హైదరాబాద్: ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెళిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ÷ుదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

## చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జ్గ÷న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు

న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై–రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి






నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ, మే 26,మన సాక్షి.**

బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు, బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుండి నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాన్నిపురస్కరించుకుని మంగళ వారం నల్గొండ పట్టణంలోని రెడ్ క్రాస్ భవనంలోమహిళ ,శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో

బాల్య వివాహల రహిత తెలంగాణ లక్ష్యంతో "బాల్య వివాహ నిషేధ చట్టం--2006"పై విద్యార్థులకు ఉద్దేశించి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూబాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి, బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలి,

బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలుదెబ్బతింటున్నాయి, కుటుంబాల్లో ఆవేదన మిగులుతున్నదని అన్నారు.విద్యార్థులు తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని, బాలికలు సంఘాలుగా ఏర్పడి తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు.

ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ ద్వారా పిల్లలకు అనేక అవకాశాలు కల్పిస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాను అతి మోతాదులో ఉపయోగించకుండా జాగ్రత్తగా ఉండాలని, ఏఐ ఫోటో మార్ఫింగ్ వంటి సైబర్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం ఎంతో ముఖ్యమని, సమాజంలో తలెత్తుకుని జీవించేలా వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రణామం వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు క్యారంస్ ఆడుతుండగా వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు. అవగాహన కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సి డి పిఓ లావణ్య ,సి డబ్ల్యూ సి చైర్మన్ చింత కృష్ణయ్య ,సి డబ్ల్యూ సి సభ్యులు భాస్కర్ వెంకన్న, డిసిపిఓ గణేష్ హాజరయ్యారు.

# టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా గుర్రం కోటేశ్వర్

**కేతేపల్లి మే 26 మనసాక్షి.**



కేతేపల్లి మండలం బండపాలెం గ్రామనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుర్రం కోటేష్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

నిరుపేద గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన గుర్రం కోటేష్ తెలంగాణ ఉద్యమం నుండి విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ ప్రజా పోరాటాలలో కీలక పాత్ర పోషించాడు. డా.పీడమర్తి రవన్న నాయకత్వంలో మాదిగ విద్యార్థి జేఏసీ నాయకుడిగా దళిత విద్యార్థుల సమస్యలపై పోరాడి ప్రత్యేక గుర్తింపు పొందాడు.కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అనుచరుడిగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం నాయకత్వంలో నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సేవలు అందిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నాడు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.గుర్రం కోటేష్ నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# సబ్సిడీపై జీలుగ విత్తనాలు

**తుంగతుర్తి మన సాక్షి మే 26.**




తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోనితిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని సొసైటీలో సబ్సిడీపై జీలుగు విత్తనాలుఉన్నవి

కావలసిన రైతులు మీ యొక్క పట్టాదారుపాస్ పుస్తకము తీసుకొని స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వచ్చి ఆన్లైన్లో నమోదు చేసుకొని సొసైటీ గోడౌన్ లో జిలుగ గింజలు తీసుకోవాలని కోరుతున్నాను 30 కేజీల జీలుగ సంచి 50% సబ్సిడీలో మనకు 50 కేజీల బస్తా కు 2452.50/- కు వస్తుంది కావున రైతులందరూ వినియోగించుకోవాలని కోరుతున్నా రూ. ఇంకా రైతులకు అందుబాటులో విత్తనాలు కావాలంటే మా అగ్రికల్చర్ అధికారులను సంప్రదించండిమండల వ్యవసాయ అధికారి సిహెచ్ నాగేశ్వరరావు.

# నల్లగొండ అష్ట దిగ్బందం

## తెల్లవారుజామున విస్తృత కార్డెన్ సెర్చ్ ఆపరేషన్. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్





**నల్లగొండ,మే 26,మన సాక్షి**





నల్లగొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ పట్టణాన్ని అష్ట దిగ్బందం చేసి నిరంతరం రద్దీ గల ప్రాంతాలు సతీష్ నగర్ తో పాటు ఇతర పలు ప్రాంతాల్లో 10 బృందలుగా ఏర్పాటు చేసి మంగళవారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడింది. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానితుల గుర్తింపు, అక్రమ కార్యకలాపాల అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ ఆపరేషన్ నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఏడు మంది సీఐలు,18 మంది ఎస్.ఐలతో నార్కోటిక్ డాగ్ తో కలిపి సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, పట్టణంలోని పలు కాలనీలు, అనుమానిత ప్రాంతాలు, లాడ్జీలు, అద్దె గదులు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

పట్టణంలో సుమారు 360 ఇండ్లలో తనిఖీలు నిర్వహించగా, 46 మంది అనుమానితులను గుర్తించి వారి వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను గుర్తించారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 10 మంది, బీహార్‌కు చెందిన 4 మంది, తమిళనాడు కు చెందిన 1 వ్యక్తి, అస్సాం కు చెందిన 1 వ్యక్తి, హర్యానాకు చెందిన 2 మంది ఉన్నారు.

తనిఖీలలో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లు,5 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. అలాగే ఆరుగురికి గంజా టెస్ట్ లు నిర్వహించగా వీరిలో ఇద్దరిని గంజా సేవించినట్లు గుర్తించడం జరిగింది.అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.సరైన పత్రాలు, రిజిస్ట్రేషన్ సక్రమంగా లేని 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు (త్రిచక్ర వాహనాలు) వీటిలో అదిక శబ్దం కలిగిన 02 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత కేసులు నమోదు చేస్తున్నారు. అదనంగా 4 సెల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

.నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది.

# గుమ్మడిదల మున్సిపాలిటీ 15 కోట్లతో అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, మే 26/(మనసాక్షి):**



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం, దోమడుగు, వీరన్న గూడెం, బొంతపల్లి, గుమ్మడిదలలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక పాలకవర్గం సభ్యులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతి వార్డులో మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని వివిధ పరిశ్రమల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎర్రోళ్ల శ్రీనివాస్ ని కలిసిన మాద్రి పృథ్వీరాజ్

**పటాన్చెరు, మే 26/(మనసాక్షి) :**



బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి సభ్యత్వ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర కమిటీ నియమించిన మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ని ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో తాము కూడా సమర్థవంతంగా పనిచేస్తామని శ్రీనివాస్ కి తెలిపారు. పటాన్‌చెరు మరియు జేపీ కాలనీ జిహెచ్ఎంసి పరిధిలోని కాలనీల్లో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరియు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం అవుతూ విజయకేతనం ఎగురవేస్తుందని, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కలిసి పనిచేయాలని ఆయన కోరారు.

# బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

**శేరిలింగంపల్లి, 26 మే మన సాక్షి**



రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆధ్వర్యంలో సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖ అధికారులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.బక్రీద్ పండుగ సందర్భంగా పరిశుభ్రత, ప్రజారోగ్యం, జంతు వ్యర్థాల సక్రమ నిర్వహణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈద్‌గాహ్‌లు, మసీదులు నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాల సేకరణ కోసం మందమైన నల్ల పాలిథిన్ కవర్లు అందుబాటులో ఉంచడం, వ్యర్థాల తరలింపుకు తగిన వాహనాలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. అలాగే రోడ్లు, ప్రజా ప్రదేశాల శుభ్రత కోసం తగినన్ని వాటర్ ట్యాంకర్లు, పారిశుధ్య సిబ్బందిని నియమించడం, అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించడం ద్వారా దుర్వాసన నివారణతో పాటు పరిశుభ్రతను కాపాడాలని సూచించారు.సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. పండుగ సందర్భంగా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఈద్‌గాహ్‌లు, మసీదులు, నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారులు సూచించిన విధంగా పాలిథిన్ కవర్లలో సేకరించాలని తెలిపారు. వ్యర్థాల తొలగింపు, రోడ్ల శుభ్రత, పారిశుధ్య నిర్వహణ కోసం సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని చూసించారు.

పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు, వ్యర్థాల తరలింపు వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించి పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా పోలీసులకు, సంబంధిత శాఖల అధికారులకు సహకరించి పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని సీపీ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశం లో ఎస్ బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, సీఏ ఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కలిసిన మారయ్య

**కుత్బుల్లాపూర్ మే 26 ( మన సాక్షి)**




కుత్బుల్లాపూర్ : గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ను మంగళవారం తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ జెండా పండుగ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జ్ ఎత్తరి మారయ్య, పడాల మనోజ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు రాజకీయ నాయకులంతా ప్రజా సమస్యల పరిష్కరించే దిశగా పనిచేయాలని జోనల్ కమిషనర్ సూచించారు. జోన్ అభివృద్ధి కోసం అందరం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు.

# పథకం ప్రకారమే హత్య

12 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ






**సూర్యాపేట మే 26 మనసాక్షి**

సూర్యాపేట జిల్లా రూరల్ పరిధిలోని సోలిపేట గ్రామంలో జరిగిన మేకల జయరాములు హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు జయరాములు తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల భూమిని గతంలో తన తమ్ముడు కృష్ణయ్యకు కౌలుకు ఇచ్చాడని, అనంతరం తిరిగి స్వయంగా సాగు చేసుకోవడం ప్రారంభించడంతో కుటుంబ సభ్యుల మధ్య భూమి, గెట్టు, ఇంటి హద్దుల విషయంలో తరచూ వివాదాలు నెలకొన్నాయని తెలిపారు.ఈ క్రమంలో నిందితులు మేకల కిరణ్, అతని భార్య మౌనిక, కిరణ్ తల్లిదండ్రులు కృష్ణయ్య, లక్ష్మమ్మ, మరో వ్యక్తి రామచంద్రు కలిసి జయరాములను హత్య చేయాలని ముందుగానే పథకం రచించినట్లు ఎస్పీ వెల్లడించారు. సోమవారం సాయంత్రం జయరాములు పొలం వద్దకు వచ్చిన సమయంలో గ్రామ ఆర్చ్ సమీపంలో అడ్డగించి గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు.హత్య అనంతరం నిందితులు గ్రామం విడిచి పారిపోయారని, కేసు నమోదు చేసిన వెంటనే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సూర్యాపేట హైటెక్ బస్ స్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.

వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గొడ్డలి, నాలుగు సెల్ ఫోన్లు, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు.భూమి, ఆస్తి తగాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని, ఓర్పు కోల్పోయి హత్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. భూమి వివాదాల కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్షలు కూడా పడుతున్నాయని గుర్తుచేశారు.కేసును వేగంగా ఛేదించిన డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## మహిళా సంఘాల నూతన భవనం ప్రారంభం

**గరిడేపల్లి మే 27 మన సాక్షి**



గరిడేపల్లి: మండలం పరిధిలోని రాయిని గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘాల సంఘ బంధం భవనాన్ని గ్రామ సర్పంచ్ గుండు రామాంజి గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, బలోపేతానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా మరింతగా అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిడమర్తి నాగరాజు గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంభయ్య కార్యదర్శి సునీత వార్డు మెంబర్స్ గుండు లక్ష్మమ్మ గురవయ్య అమరారపు తిమోతి రాజు గుండు నర్సింహారావు రాచమల్ల శ్రీకాంత్ అమరారపు పేతురు బెక్కం విజయ్ జయరాజ్ సంఘబంధం అధ్యక్షురాలు గుండు అంజమ్మ కుమారి సుహాసిని సావిత్రి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**సూర్యాపేట మే 26 మనసాక్షి**





జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బిబి గూడెం లోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలాల్లోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

**గరిడేపల్లి మే 27 మనసాక్షి**



గరిడేపల్లి మండలం పరిధిలోని సర్వారం గ్రామపంచాయతీలో ఏడు లక్షల వ్యయంతో ఒకటి రెండో వార్డ్ ఎస్సీ కాలనీ లో నిర్మిస్తున్న సైడ్ డ్రైనేజీ పనులను మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన గ్రామ సర్పంచ్ చింతకాయల వినోద నాగేశ్వరరావు, ఈ సందర్భంగాసర్పంచ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సైడ్ డ్రైనేజీ కి నోసుకొని రెండో వార్డ్ ఎస్సీ కాలనీలో మాట ఇచ్చిన తీరుగా నిలబెట్టుకొని సైడ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు,మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సాయం సహకారాలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఇంకా ముందుకు తీసుకుపోతామని సర్పంచి తెలియజేశారు , ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకాయల వినోద నాగేశ్వరరావు, వార్డ్ నెంబర్ బత్తుల నాగరాజు,బరిగెల తిరుపయ్య, ఒగ్గు విశాక, నందిగామ గురవయ్య, నందిగామ బన్నీ పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి

మండల కార్యదర్శి ఎస్.కె యాకోబ్

**గరిడేపల్లి మే 27 మనసాక్షి**



గరిడేపల్లి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పెంచిన డీజిల్ పెట్రోల్ రేట్లు తగ్గించాలని ఆందోళన చేయడం జరిగినది ,ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు యాకూబ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం పేరుతో వారంలోనే మూడుసార్లు డీజిల్ పెట్రోల్ రేట్లు పెంచి ప్రజలపై భారలు మోపిందని అన్నారు ఐదు రాష్ట్రాల ఎన్నికల అప్పుడు డిజిల్ పెట్రోల్ రేటు పెరగబోవు అని చెప్పి ఎన్నికలు ముగిశాక ఫలితాలు రాకముందే మూడుసార్లు రేట్లు పెంచి పెట్రోల్ నూట పది రూపాయలు డీజిల్ 98 రూపాయలు పెంచటం మూలాన వచ్చే జూన్ నెలలో వ్యవసాయ పనులు ప్రారంభోదశలో డీజిల్ రేట్ ల మూలాన వ్యవసాయం సంక్షోభంలో పోయే పరిస్థితులు ఉన్నాయని అన్నారు ఇప్పటికే ఎకరాకి ట్రాక్టర్ కి 5000 రూపాయలు చొప్పున అవుతుంది ఈ పెరగటం మూలాన రైతులు కౌలుదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని అన్నారు పోతే పరిస్థితి ఏంటని అన్నారు ఇలా ధరణి పెంచటం వెంటనే అన్నారు, మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి ఇలా ప్రజలను పీడించే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించకూడదని అన్నారు మరోపక్క గ్యాస్ కూడా ధరపెంచి ప్రాణ ప్రధానమంత్రి 12 లక్షల సూట్ వేసుకొని ఒకేసారి తొడుగుతారు ఇప్పటికీ వారానికి ఒకే ఒక్క తొడిగే వాళ్ళు లక్షల్లో ఉన్నారు ఇలాంటి వాళ్ళు దేశాన్ని బాగు చేస్తారా దేశాన్ని దోచుకునే ఈ బీజేపీ మన పాలిట శావంగా మారిందని అన్నారు అర్హులైన వారందరికీ ఇవ్వాలని రెండున్నర సంవత్సరాలైనా ఇల్లు ఇవ్వకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో చారి మత్తయ్య రవి,దేవరం వీరారెడ్డి,హుస్సేన్ ఆనంద్ అతని నరసయ్య జానీ ముస్తఫా చంద్రయ్య పాండు సంపత్ శంకర్ సుందరయ్య భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా నేత్రం

సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య

**సూర్యాపేట మే 26 మనసాక్షి**



సూర్యాపేట పట్టణంలోని ఇటీవల కాలంలో గంజాయి, హుక్కా, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం జరుగుతుంది. దానిని నియంత్రించేందుకు
సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య వినూత్న రీతిలో డ్రోన్ కెమెరా ద్వారా రెండు మూడు కిలోమీటర్లు కెమెరాలో బంధించడం జరుగుతుందని తెలిపారు.
గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఎవరైనా సేవించవద్దని , ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని , పట్టణ సి ఐ వెంకటయ్య కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దని హెచ్చరించారు. వారితో పాటు ఎస్సైలు ఏడుకొండలు,మహేంద్రనాథ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## వడదెబ్బతో మహిళ మృతి

**అనంతగిరి మే 26 మన సాక్షి**



అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన నర్రా సైదమ్మ(45) వడదెబ్బతో మృతి చెందింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత కారణంగా ఆమె అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్యం మరింత విషమించడంతో ఇంటి వద్దనే ఆమె మృతిచెందింది. సైదమ్మ మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

## కిషోర బాలికల సైకిల్ ర్యాలీ

**గరిడేపల్లి మే 27 మనసాక్షి**



గరిడేపల్లి మండల కేంద్రం లో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా 15 నుండి 18 సంవత్సరాల కిషోర బాలికల పిల్లలతో సైకిల్ మరియు వ్యాయమ కార్యక్రమం గౌరవ ఎంపీడీఓ సరోజ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈ వయసు ఉన్న బాలికలచే మండలం మొత్తం 48 సంఘాలు, దాదాపు 500 మంది ని ఇదేంటీఫై చేయడం జరిగింది, ఈ కార్యక్రమం జూన్ 10 వ తారీకు వరకు ఉంటుంది, మండలం లో పొనుగోడు, కల్మల్ చెర్వు, కీతవారిగూడెం, గడ్డిపల్లి, గానుగబండ, సర్వారాం, పరెడ్డిగూడెం, రాయని గూడెం, వెల్లిదండ జీపీ లో ఈ కార్యక్రమం చేయడం జరిగింది, ఈ కార్యక్రమం ఏపీఎం అజయ్ నాయక్, సీసీ సుజాత, సైదులు, విఓ ఏ లు పద్మ, కమల, రవి, సరిత, రాజేశ్వరి, పద్మ, సుజాత,కరుణాకర్, అనుజత, ఇందిరమ్మ, రామ, సంధ్య, లలిత, నాగలత అంజమ్మ, శైలజ, అన్నపూర్ణ,విజయలక్ష్మి, ధనలక్ష్మి, మంజుల, రాజ్యం, మరియు విఓ ప్రెసిడెంట్ లు పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ

**సూర్యాపేట మే 26 మనసాక్షి**



వేసవి నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్ హెచ్ ఆర్ సి ) రాష్ట్ర చైర్మన్ చింతపల్లి వెంకటేశ్వర్లుఅన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి, జాతీయ మానవ హక్కుల మండలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరం ఉంటేనే బయటికి రావాలని తెలిపారు. ప్రజల హక్కులను కాపాడేందుకు నేషనల్ వుమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ హెచ్ ఆర్ సి (వివో ) ముందు ఉంటుంది అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండడమే కాకుండా చట్టబద్ధంగా చట్ట పరిధిలో ప్రజల తరఫున నిలబడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్ల రమేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రెటరీ బార్పటి సునీత, జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్ప, కన్వీనర్ సారగండ్ల సైదులు, కోఆర్డినేటర్ కృష్ణ,చంద్రకళ పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అధ్యక్షునిగా పెండెం జ్ఞానేశ్వర్



**తుర్కపల్లి ,మే 26 మన సాక్షి -**

తుర్కపల్లి మండల కేంద్రంలో తుర్కపల్లి గ్రామ పద్మశాలి సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం అధ్యక్షునిగా పెండెం జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షునిగా అంబటి చెన్న కిష్టయ్య, ఉపాధ్యక్షునిగా కళ్యాణం కృష్ణ ప్రధాన కార్యదర్శిగా పెండెం నరసింహులు, జాయింట్ సెక్రెటరీగా పిండం నరేందర్, కోశాధికారిగా నరసింహులు ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పెండెం రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెండెం జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పద్మశాలిలు అందరూ ఐక్యంగా ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందజేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుని సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెండెం రాములు, పెండెం బలరాం ,పెండెం పాండు, పెండెం శంకర్, పెండెం బాల శంకర్, పెండెం పాండు, గణపురం వనిత్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**గరిడేపల్లి మే 27మనస్సాక్షి**

గరిడేపల్లి మండలంలోని సర్వారం గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ ఆధ్వర్యంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ చింతకాయల వినోద నాగేశ్వరరావు , మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ తలగకుండా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయం వారు అన్నారు. ఏర్పాటు చేసి సేవలు చేస్తున్న గ్రామ ఆశావర్కర్ ఏఎన్ఎం అభినందించారు.అదేవిధంగా ఉపాధి కూలీలు ఓ ఆర్ ఎస్ తాగడం వలన ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున, ఉదయం 6 గంటల 9 గంటల వరకు నుండి సాయంత్రం 4:00నుడి ఐదు గంటల వరకు కూలీలు సమయపాలనపాటించవలసిందిగా సూచించారు ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కందుల పద్మావతి నాగిరెడ్డి ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్ మీసాల జ్యోతి,ఫీల్డ్ అసిస్టెంట్ మాతంగి స్వామి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు,

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**శాలిగౌరారం మే 26 మనసాక్షి**



శాలిగౌరారం గ్రామానికి చెందిన కీర్తిశేషులు బుడిగె యాదగిరి 20వ వర్ధంతి సందర్భంగా శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.క్లబ్ జోన్ చైర్మెన్ బుడిగె శ్రీనివాస్-నాగమణి దంపతుల ఆర్థిక సహకారంతో ఉపాధి హామీ కూలీలకు, ఆసుపత్రిలోని గర్భిణీ స్త్రీలకు, రోగులకు, వైద్య సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శాలిగౌరారం సర్పంచ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుజలాల్ శేఖర్ బాబు, మండల వైద్యాధికారి డా. శిల్ప, ఎంఈఓ మందుల సైదులు, క్లబ్ కోశాధికారి గుండు పరమేష్, గౌరవ సలహాదారులు రామడుగు వెంకట్రామ శర్మ, సభ్యులు దునక వెంకన్న, మారోజు వెంకటాచారి, కప్పల శ్రీకాంత్, నిమ్మల వీరస్వామి, వడ్లకొండ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు టోకరా.

**తుంగతుర్తి మన సాక్షి మే 26.**



తుంగతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొన్ని మహిళా సంఘాల మిగిలినవి సొసైటీలవి ధాన్యం కాంటాలు వేస్తున్నారు అందులో తూకం 41. .500 గ్రాము లకు జోకుతూ మా పైన హమాలీలు కేంద్రంలోని నిర్వాహకులు ఒక బస్తాకు మూడు రూపాయలు లారీ డ్రైవర్లకు ఇవ్వాలని దండుకుంటున్నారు మరోపక్క బీహార్ అమాలీలు తెలంగాణ అమలు కాంటాలు వేసుకుంటూ వారు ఇష్టం వచ్చిన వడ్లను ఎత్తుకు పోతున్నారు ఇదేమిటని అంటే ఇంత ఎండలో మేము కాంటాలు వేయము అని రైతులను బెదిరించడంతో వారుఆరుగాలం కష్టపడి పంట పండిస్తే మాకు అంత దగా జరుగుతుంది అని అని పలు గ్రామాలలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క కొనుగోలు కేంద్రాలలో గాలిమరలు పనిచేయడం లేదు వాటిని బాగు చేయుటకు ఈ సంఘాల నిర్వాహకులు మోటార్ కాలినప్పుడల్లా 3000 రూపాయలు ఖర్చు అవుతుందని మొరపెట్టుకుంటున్నారు. మరోపక్క రైతులకు త్రాగునీటి సౌకర్యం టెంటు సౌకర్యాలు కల్పించాలని అధికారులు చెప్పినప్పటికీ చెవిలో పెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యం. మరో పక్క దాన్యం కాంటాలు పెట్టి బస్తాలు లోడు కాక 10 నుండి 15 రోజులు అక్కడనే ఉన్న ధాన్యం తూకం రాక లారీ ఎగుమతి చేయగానే మాకు నష్టం వాటిలిందని నిర్వాహకులు మా మీదనే కోతలు పెడుతున్నారు ఇంకోపక్క మేము గాలిమరల తో ధాన్యం పట్టి శుభ్రం చేసి మ్యాచరు వచ్చిన తర్వాత కాంటాలు వేసిన ఇంకా మాకు కోతలు తప్పవా అని ఆవేదనకు గురవుతున్నారు. ఇక మేము ఎవరికీ చెప్పుకోవాలి మా బాధలు అని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ మండల అధికారులు చీమ కుట్టినట్లు కూడా కనిపిస్తలేదు ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నెల రోజులు ధాన్యం పోసిన ఇంకా 60 శాతం కాంటాలు పెట్టి ఎగుమతి కాలేదని రైతులు గగోలు పెడుతున్నారు అధికారులు మాత్రం జిల్లా అధికారులు వచ్చి ఐకెపి నిర్వాహకులను తొందరగా కాండాలు వేసి మీరు ఎగుమతి చేయాలని మిల్లుల వద్ద మేము 12 గంటలలో మీకు దిగుమతి చేయిస్తామని చెప్పుతున్నారు కానీ రెండు రోజులు అయినా గాని లారీ దిగుమతి కావడం లేదు అని నిర్వాహకులు మొరపెట్టుకుంటున్నారు. ఇన్ని జరిగిన లారీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అతనికి వాహనాలు సరిగా లేకున్నా ఆనాడు నుండి 10 సంవత్సరాల నుండి ఇప్పుడు కూడా ఆయనే కాంట్రాక్టు బట్టి లారీలు సప్లై చేస్తానని కాంట్రాక్టు పట్టారు కాళీ బస్తాలు మేమే ఇస్తామని ఆరోజు చెప్పారు కానీ ఖాళీ బస్తాలు ఐకెపి నిర్వాహకులు సమయానికి రాక మేమే తెచ్చుకుంటున్నాము ఆ ఖర్చు మేమే భరిస్తున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరిగినప్పటికీ లారీ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోకపోవడం ఈ నిర్లక్ష్యానికి కారణం ఎవరు? అటు ప్రజాప్రతినిధులు ఇటు అధికారులు మాయమాటలు చెప్పడమే తప్ప చేసింది ఏమీ లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

రైతుల ధాన్యాన్ని ఎగుమతి చేసిన తర్వాత మూడు రోజులలో మీకు డబ్బులు మీ అకౌంట్లో వేస్తానని చెబుతున్న అధికారులు అది కూడా చక్రమంగా రావడం లేదని రైతులు చాలా లేట్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఒకపక్క రోహిణి కార్తె ప్రారంభం అయింది ఇక మేము ధాన్యం ఎప్పుడు అమ్ముకోవాలి మాకు డబ్బులు ఎప్పుడు రావాలి మేము ఎప్పుడు పొలం దున్ని నార్లు పోసుకోవాలి మాకు డబ్బులు లేక అప్పుల పాలు అవుతున్నామని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేస్తుంటే ఇక రైతు నెలలు గడిచిన కాంటాలు వేయకపోతే ధాన్యం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ఎలా పోస్తారు అని రైతులు డిమాండ్ చేస్తున్నారు ప్రతిపక్ష నాయకులు పత్రికలలో రోజు రైతుల గోస వినిపిస్తే లేదా అని ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారు అయినా చీమకుట్టినట్టు కూడా ప్రభుత్వానికి లేదని అర్థమవుతుంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

**డయల్ యువర్ నారాయణపేట ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన**

**నారాయణపేట టౌన్, మే 26 మనసాక్షి :-**




నారాయణపేట జిల్లా ప్రజల కు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమా నికి విశేష స్పందన లభించిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదించి తమ సమస్యల ను తెలియజేసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంట ల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారులు స్వయంగా ఎస్పీ కి ఫోన్ చేసి తమ సమస్యలను నేరు గా వివరించారు. ఈ కార్యక్ర మానికి మొత్తం 18 ఫోన్ కాల్స్ వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ ప్రాంతాల్లో, బెల్ట్ షాప్ ల ఎక్కువగా నడుస్తున్నాయి అని, భూతగాదాలకు సంబంధించిన సమస్యలు రావడం జరిగింది, ఆరు బయట మద్యం సేవిస్తు న్నారని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని, డబ్బు లు తీసుకొని ఇవ్వకుండా చీటింగ్ చేస్తూనారు, పలువు రు తమ సమస్యలను తెలి యజేశారు. ఈ సమస్యల న్నింటినీ జిల్లా ఎస్పీ స్వయం గా నోట్ చేసుకొని సంబం ధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ అధికారుల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హామీఇచ్చారు.

ప్రజల సమస్యల పరిష్కారం లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల పక్షానే పనిచేస్తుందని, ప్రజలకు న్యాయం చేయడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీసు లను సంప్రదించాలని సూచించారు. ఇలాంటి డయ ల్ యువర్ ఎస్పీ కార్యక్రమా లను తరచూ నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావడమే పోలీస్ శాఖ లక్ష్య మని ఎస్పీ తెలిపారు. ప్రజ లు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి

**39వ కార్పొరేటర్ మాసం గణేష్..**

**కరీంనగర్ మే 26, మనసాక్షి :**



బాల్య వివాహాలను అరికట్టాలని, బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలకు తీవ్ర నష్టం జరుగుతుందని 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మంగళవారం బాల్య వివాహరహిత తెలంగాణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే ఆడపిల్లలకు కలిగే ఇబ్బందులు నష్టాలను వివరించారు. సినిమాల ప్రభావాల వల్ల కొంతమంది చిన్న వయసులోనే పెడదారి పడుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పచుకొని వాటి సాధన కోసం ముందు కొనసాగాలన్నారు .1098 చైల్డ్ హెల్ప్ లైన్ మెంబెర్ సాయి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ 1098 టోల్ ఫ్రీ నెంబర్ ను కంప్లైంట్స్ కోసం వినియోగించుకోవాలని , నేరుగా చిన్నారుల సమస్యలను తెలియజేయవచ్చని చెప్పారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ అరుణ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ద చూపాలని, మహిళలు ఆరోగ్యాంగా ఉంటే నే కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని, తద్వారా ఆరోగ్య సమాజం నిర్మించ బడుతుందన్నారు. పి.హెచ్.సిల లో మహిళలు క్రమంగా హెల్త్ చెకప్ లు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ చంద్ర హాస్, బిసి సతీష్,1098 మెంబెర్ సాయి, స్వప్న, అంగన్వాడీ టీచర్స్, ఆర్ పి ఎస్ మహిళలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. అనంతరం 39వ డివిజన్ పరిధిలోని భారతరత్న, శ్రీనిధి, మహాత్మ మహిళా సమాఖ్య సభ్యులకు ఇందిరమ్మ చీరలను కార్పొరేటర్ మాసం గణేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివో సునీత, ఆర్.పి మానుకోట సునీత, రమ, రాధా, లక్ష్మీ శారద లతో పాటు ఆయా మహిళ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి చెక్ పోస్టుల ఆకస్మిక తనిఖీ

**నారాయణపేట టౌన్, మే 26 మనసాక్షి :-**



బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షణ, అక్రమ రవాణాల నియంత్రణ ప్రజలకు భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నారాయణపేటలోని ఎర్రగుట్ట చెక్ పోస్టును, దామ రగిద్ద మండలంలోని కాన్కు ర్తి బోర్డర్ చెక్ పోస్టును సంద ర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పనితీరును పరిశీ లించారు. చెక్ పోస్టుల వద్ద నిర్వహిస్తున్న వాహన తని ఖీలు, రాత్రి పూట భద్రతా చర్యలు, అనుమానాస్పద వ్యక్తుల పరిశీలనతో పాటు పాయింట్ బుక్ నమోదు లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మొత్తం 07 చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వ ర్తించే పోలీసులు, వెటర్నరీ డాక్టర్ లు 24ఐ7 అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. విధుల్లో ఎలాం టి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ బక్రీద్ పండు గను ప్రజలు ప్రశాంత వాతా వరణంలో జరుపుకునేలా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింద న్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాలు మరియు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని

తెలిపారు. అక్రమ మద్యం, గంజాయి, పశువుల అక్రమ రవాణా, పేలుడు పదార్థాలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలా పాలపై ప్రత్యేక దృష్టి సారిం చాలని పోలీసు అధికారుల కు ఆదేశించారు. ప్రజల భద్ర త విషయంలో ఎట్టి పరిస్థి తుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. అలాగే ప్రజ లు కూడా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాల గురించి సమాచా రం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయ గలమని తెలిపారు. ఈ తనిఖీలలో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొడంగల్ కోర్టు డిఫెన్స్ కౌన్సిల్ గా న్యాయవాది రమేష్

**కొడంగల్ మే 26 మన సాక్షి.**



కొడంగల్ నియోజకవర్గం కొడంగల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గా అడ్వకేట్ కె . రమేష్ ను నియమిస్తూ తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవాదిని నియమించుకొలేని నిరుపేదలు బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సలహాలు సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# మల్లు స్వరాజ్యం ట్రస్ట్ కు రెండు ఎకరాల భూమిని కేటాయించాలి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించిన సిపిఎం నేతలు**

**సూర్యాపేట మే 26 మనసాక్షి**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళ ఉద్యమ నాయకురాలు శ్రీమతి మల్లు స్వరాజ్యం ట్రస్ట్ సేవా కార్యక్రమాల కొనసాగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని ఎల్బీనగర్, లేదా హయత్ నగర్ లేకుంటే సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ లోని ప్రగతి భవన్ లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని సిపిఎం రాష్ట్ర ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం 2022 మార్చి 19న మరణించారని గుర్తు చేశారు. స్వరాజ్యం నిజాం వ్యతిరేక పోరాటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆ సైన్యాలతో తుది వరకు పోరాడిన వీరనారి స్వరాజ్యం అని, రెండుసార్లు తుంగతుర్తి నియోజకవర్గం నుండి శాసన సభ్యురాలుగా గెలిసి, తన నియోజకవర్గమే కాకుండా రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. మహిళలకు ఆస్తి హక్కు లాంటి అనేక చట్టాల రూపకల్పనలో ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు ఇస్తూ కీలకపాత్ర పోషించారని అన్నారు. మహిళా సంఘం అఖిలభారత నాయకురాలుగా పనిచేస్తూ మహిళా సమస్యలు - హక్కులు, వివక్షత, పేదరికం వెనుకబాటు తనంపై చివరి వరకు పోరాడిన ఆదర్శ నేత మల్లు స్వరాజ్యం అన్నారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఏర్పాటు చేసి బాలికలకు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ, కుటుంబాలలో వస్తున్న సమస్యలపై కౌన్సిలింగ్, లీగల్ సేల్, స్టార్ట్ స్టే హోమ్, స్టడీ సర్కిల్స్, కంప్యూటర్ శిక్షణ, స్వయం వృత్తిసహాయక శిక్షణ, వంటి అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు ఇంకా విస్తృతంగా విస్తరించడానికి రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు కూడా అవసరం, ఇలాంటి సేవా కార్యక్రమాల అవసరం కోసం గత ప్రభుత్వాలు అనేక సంస్థలు, సంఘాలను ప్రోత్సహిస్తూ వారికి వనరులు సమకూర్చే విధంగా కృషి చేశారు. కాబట్టి మా సేవా కార్యక్రమాలు విస్తరించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మల్లు స్వరాజ్యం ట్రస్టుకు హైదరాబాదులోని ఎల్బీనగర్, లేదా హయత్ నగర్ లేదా సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, పోతినేని సుదర్శన్, నున్న నాగేశ్వరరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ సేవా కార్యక్రమాల కొనసాగింపుకు సిపిఎం నాయకులు విజ్ఞప్తిని పరిశీలించి ట్రస్ట్ కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

# తొలగించిన ఆర్టీసి డ్రైవర్ ను విధుల్లోకి తీసుకోవాలి

**కరీంనగర్ మే 26, మనసాక్షి :**



వడ్ల కొనుగోలు పై ప్రశ్నించేందుకే... ఓ ఆర్టిసి డ్రైవర్ పై వేటు వేయడాన్ని ఖండించారు మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి. జగిత్యాల ఆర్టీసి డ్రైవర్ ను విధుల నుండి తొలగించడాన్ని నిరసిస్తూ.. మంగళవారం మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డిల ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు ఆందోళనబాట పట్టారు. తొలగించిన ఆర్టీసి డ్రైవర్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ ఆర్టీసి ఆర్ఎంకు వినతి పత్రాన్ని అందించారు. ప్రజా పాలన ప్రభుత్వమంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తుందన్నారు గంగుల. ధాన్యం కొనుగోలు అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ దుర్మార్గమన్నారు. సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు బి.అర్.ఎస్ పార్టీ అండగా ఉంటుందన్న గంగుల. డ్రైవర్ సస్పెన్షన్ ఎత్తివేసే వరకు అవసరమైతే అర్.ఏం కార్యాలయం ముందు బైఠాయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. బి.అర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తాత్కాలిక డ్రైవర్ గా ఉన్న అశోక్ ను పర్మినెంట్ డ్రైవర్ గా ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామి ఇచ్చారు.

# గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి

**శివంపేట మే 26 మన సాక్షి**



నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట మండలం లోని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్కు హైదరాబాద్లోని కార్యాలయంలో కలిసి మెదక్ జిల్లా గ్రంథాలయం చైర్మన్ చిలుముల సుహాసిన్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. శివంపేట మండలంలోని పెద్ద గొట్టిముక్కల గోమారం చెన్నాపూర్ బిజిలిపూర్. సికింద్రా ఫోర్. మనోహరాబాద్ మేడ్చల్ మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్కు ఆమె విజ్ఞప్తి చేశారు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు ఆమె వెంట శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ నాయకులు తదితరులు ఉన్నారు

## బొల్లంపల్లిలో ఘనంగా మహిళా వారోత్సవాలు

**వెల్దండ మే 26 మన సాక్షి:**



వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి అంగన్వాడీ కేంద్రంలో మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా మహిళల గర్భిణీ, బాలింతలకు, చిన్నపిల్లలకు పోషకాహారం ఎంతో ముఖ్యమని, పిల్లల ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం తప్పక తీసుకోవాలని, అంగన్వాడి కేంద్రాలలో అందించే గుడ్లు, పాలు, బాలామృతం వంటి సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. తాజా పండ్లు, ఆకుకూరలతో పాటు పోషకాహారాన్ని తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయ, మాధవి, మాత, శారద, ఆయా నర్సమ్మ , మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అగ్నికి ఆహుతైన గొర్రె పిల్లలు

**వెల్దండ మే 26 మన సాక్షి:**



నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామంలో ఓ రేకుల షెడ్డులో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదంతో ఒక్కసారిగా చెలరేగాయి. దీంతో ఆ షెడ్డులో వున్న 10 గొర్రె పిల్లలు మంటల్లో చిక్కుకుని కాలి బూడిదయ్యాయి. అక్కడే నిలిపిన కారుతో పాటు ఎరువులకు కూడా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక అధికారులు మంటలను అదుపు చేశారు. ఘటనాస్థలానికి సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై యుగేంధర్ రెడ్డిలు చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. బాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పేటలో ఘనంగా గజ్జలేశ్వరీదేవి బోనాలు.

నారాయణపేట టౌన్, మే 26 మన సాక్షి : -





నారాయణపేట జిల్లా కేంద్రం లో మంగళవారం శ్రీ గజ్జలేశ్వరీదేవి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.
ప్రతి ఏటా రోహిణి కార్తె మొదటి రోజు అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈ సారి అమ్మవారి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పూజారి గౌడుగు నర్సింలు ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను వైభవోపేతంగా ఊరేగిస్తూ ఆలయానికి చేర్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆతర్వాత అమ్మవారికి పూజారులు పెద్దబోణం సమర్పించారు. పెద్దబోణం సమర్పణ అనంతరం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. అమ్మవారికి భక్తులు కోళ్లు,మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈసారి వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండించి సిరి సంపదలు కల్పించాలని అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారికి మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# తెలంగాణ రక్షణ సేన మహా ధర్నా.



**పేట హక్కులకై తెలంగాణ రక్షణ సేన పోరుకేక.**

**తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్.**

నారాయణపేట టౌన్, మే 26 మనసాక్షి :-

జిల్లా హక్కుల సాధనకై తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) శంఖారావం పూరించింది. జిల్లా నుంచి వెనక్కి తరలించిన ప్రభుత్వ విద్యాసంస్థలను వెంటనే తిరిగి తీసుకురావాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం మున్సిపల్ పార్కు దగ్గర మంగళవారం జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన జనసందోహంతో నారాయణపేట వీధులు హోరెత్తాయి. కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పార్కు సమీపంలో తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ధర్నాలో గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉదాసీనతపై ఘాటుగా విరుచుకుపడ్డారు. జిల్లా నుండి వెనక్కి పోయిన ప్రభుత్వ విద్యాసంస్థలను తక్షణమే నారాయణపేటకు రప్పించి తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించి ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే అందుబాటులోకి తేవాలని, నూతన ఎస్పీ కార్యాలయ నిర్మాణాన్ని యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ 'రైతు భరోసా' నిధులను తక్షణమే జమ చేయాలని, జిల్లాలో నత్తనడకన సాగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వికారాబాద్‌లో ఉన్న పంచాయతీరాజ్ ఎస్సి నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని, అలాగే పాలమూరులో ఉన్న దేవాదాయ శాఖ కార్యాలయాన్ని తక్షణమే జిల్లా కేంద్రానికి తరలించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోమని, ప్రభుత్వ విద్యాసంస్థలను, కార్యాలయాలను వెనక్కి తీసుకువచ్చే వరకు మా పోరాటం ఆగదని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ధర్నా అనంతరం నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలనా అధికారి కి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మహా ధర్నాలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు శ్రీనివాస్ రావు, కృష్ణ కిషోర్, కొడంగల్ పార్టీ ఇంచార్జి నీలి జనార్దన్, నారాయణపేట పట్టణ అధ్యక్షుడు చంద్రు ముదిరాజ్, దామరగిద్ద పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యువత అధ్యక్షుడు మనోజ్ గౌడ్, కొత్తపల్లి అధ్యక్షులు శివ కుమార్, ఆశన్‌పల్లి నారాయణరెడ్డి, రమేష్, కాందేన్‌పల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, నరేష్, భీమాషప్ప, నర్సింహ, కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

**చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం**

కరీంనగర్ మే 26, మనసాక్షి :



జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగంపేట, కోరపల్లి గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను సందర్శించిన ఆయన, అక్కడ రికార్డులను పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. ?ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, బాధ్యతాయుతంగా పనిచేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ?ఈ తనిఖీల్లో ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, వెంకట్ స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొట్రలో ఉచిత కరాటే శిక్షణ



వెల్దండ మే 26 మన సాక్షి :

పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాలుగా తన స్వగ్రామంలో పిల్లలకు ఉచిత కరాటే శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు కరాటే మాస్టర్ నీరటి కుమార్. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు. ప్రతి ఏడాది మాదిరి గానే ఈ ఏడాది కూడా వెల్దండ మండలం కొట్ర గ్రామంలో కరాటే మాస్టర్ నీరటి కుమార్ ఉచిత కరాటే శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 40 మంది విద్యార్థులు నీరటీ కుమార్ పర్యవేక్షణలో యుద్ధ విద్యను నేర్చుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 200 మందికి పైగా తాను నేర్చుకున్న యుద్ధ విద్యను పంచిపెట్టినట్లు మాస్టర్ కుమార్ తెలిపారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పొంగులేటిని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి.

వెల్దండ:మే 26 మన సాక్షి:



రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని మండల కేంద్రంలో బీఆర్ఎస్ బీసీ విభాగం మండల అధ్యక్షుడు పురుగుల నర్సింహ ముదిరాజ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగే అర్హతను మంత్రి కోల్పోయారని, వెంటనే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందించి మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి తన వద్ద ఉన్న కొన్ని పత్రాలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందించగా, ఆ పత్రాలను ఆయన ముఖంపై విసిరివేశారని, సహచర మంత్రిని గౌరవించకుండా, బీసీ వర్గానికి చెందిన నాయకుడిని అవమానించే విధంగా ప్రవర్తించడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. బీసీ సమాజం గౌరవాన్ని దెబ్బతీసేలా జరిగిన ఈ ఘటనపై మంత్రి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ నాయకులను తక్కువ చేసి చూపించే ధోరణిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. బీసీ సమాజానికి అవమానం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమేష్ గౌడ్ బీఆర్ఎస్ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు పరిశీలించిన.. ఎంపీడీఓ

వెల్దండ మే 26 (జనం సాక్షి):



వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామాన్ని ఎంపీడీవో ఈసం కృష్ణయ్య మంగళవారం సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగినది. గ్రామ పరిధిలోని కల్యాణి కుంట చెరువులో పూడికతీత పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలకు ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. పనిప్రదేశంలో సేదదీరెందుకు నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ శిరీష వెంకటేష్ యాదవ్,పంచాయతీ కార్యదర్శిని అభినందించడం జరిగినది. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి పణాళికలో భాగంగా సెర్ప్ శాఖ ద్వారా 2026మే5 నుండి 2026మే30 వరకు మండల మహిళా సమాఖ్య ద్వారా చేపట్టబోయే అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, కౌమార దశ ఆడపిల్లలు 14 సంవత్సరాలనుండి 17 సంవత్సరాల వయసు కలిగిన బాలికలచేత క్రొత్తగా పొదుపు గ్రూపులు ఏర్పాటు చేయుటకు తల్లిదండ్రులు సహకరించాలని, ఆ గ్రూపులకు స్నేహ సంఘాలని పేరుపెట్టాలని, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలని పని ప్రదేశంలోనే మహిళలకు తెలియజేయడం జరిగింది. గ్రామంలో త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణ, సెగ్రిగేషన్ షేడ్, వైకుంఠ ధామం, వీధులు శుభ్రం, మురుగు కాల్వల నిర్వహణ గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్శనలో సర్పంచ్ జే. శిరీష, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఓ ఈశ్వర్ జీ, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆంజనేయులు, మేట్ పాల్గొనడం జరిగింది.

# తహసిల్దార్ కార్యాలయంలో నత్తనడకన పనులు

వెల్దండ మే 26 మన సాక్షి

: వెల్దండ తహసిల్దార్ కార్యాలయంలో కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, స్థానిక ధ్రువీకరణ తదితర పత్రాలు జారీ చేయడంలో అధికారుల పనితీరు నత్తనడకన సాగుతుందని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల ఎమ్మార్వో కార్యాలయంలో గత 15 రోజుల కింద దరఖాస్తు చేసుకున్న పత్రాలు నేటికీ కూడా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి పనిలో పైరవీ కారులదే పైచేయి అన్నట్టుగా పనులు నడుస్తున్నాయని సాధారణ ప్రజలు ఆరోపిస్తున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సర్టిఫికెట్ల జారీ విషయంలో ఆలస్యం చేయొద్దని కోరుతున్నారు.

# ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలి

శివంపేట మే 26 మన సాక్షి



రైతులకు ఎంతో లాభ అలా పంటలు నడిపించడానికి ఆయిల్ ఫామ్ పంట ఎంతో లాభాదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారిని లావణ్య అన్నారు శివంపేట మండలంలోని దొంతి గ్రామంలో రైతులకు ఆయిల్ ఫాం పంటల వివిధ రకాల పంటల పైన రైతులకు అవగాహన కల్పించాలి ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ కోతుల బెడద వలన రైతులకు ఆయిల్ పంట పంటను సాగు చేస్తే అధిక దిగుబడి వచ్చి రైతులకు ఆయిల్ ఫామ్ పంట వారం లాంటి గా ఉంటుందని రైతులే లాంటి దిగులు చెందవద్దని ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసుకుని లాభాల్లో ఉండాలని రైతులకు ఆమె సూచించారు ఈ సమావేశంలో ఉప సర్పంచ్ భావనగారి శ్రీనివాస్. ఏఈవో వినత రైతులు తదితరులు పాల్గొన్నారు

# దౌల్తాబాద్ నూతన తాసిల్దార్ గా వెంకటస్వామి.

కొడంగల్ మే 26 మన సాక్షి.



కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం నూతన తాసిల్దార్ గా వెంకటస్వామి ఈరోజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దౌల్తాబాద్ మండలంలో పనిచేస్తున్న తహసీల్దార్ గాయత్రి యాలాల్ మండలానికి బదిలీ అయ్యారు. గతంలో ఆయన వికారాబాద్ జిల్లా యలల్ మండలంలో తాసిల్దార్ గా పనిచేశారు వెంకటస్వామి.

# బెల్లి లలితకు ఘనంగా నివాళులు



శివంపేట మే 26 మన సాక్షి

నలగొండ జిల్లాలోని భువనగిరిలో లోని తెలంగాణ గాన కోకిల అయిన బెల్లి లలిత అక్క 27వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని బోనగిరి చౌరస్తా వద్ద జరిగిన వర్ధంతి సమావేశంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారు గంగాధర్ తో పాటు ఆయా ప్రజాసంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు ఘనంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఆమె నేడు లేకపోయినా ఆమె పాటలు లేకపోయినా ఆమె పాటలు నేటికీ జ్ఞాపకార్థంగా మిగిలిపోయాయని పలువురు విచారం వ్యక్తం చేశారు తెలంగాణ గాన కోగిలైన బెల్లి లలిత అక్క నేడు మన మధ్యల లేకపోవడం ఎంతో బాధాకర విషయం అనే పలువురు విచారణ వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు అభిమానులు కళాకారులు పాల్గొన్నారు

# ఎచ్ టి విత్తనాలు కొని మోసపోవద్దు

**జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్.**

నారాయణపేట టౌన్, మే 26 మనసాక్షి : -

ప్రస్తుతం మార్కెట్‌లో ప్రచారంలో ఉన్న ఎచ్ టి పత్తి విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. ఇప్పటివరకు భారత ప్రభుత్వం అనుమతించిన పత్తి విత్తనాలు బి జి--III / బిటి--III విత్తనాలు కావు, కేవలం బిజి--×× / బిటి--II పత్తి విత్తనాలు మాత్రమే చట్టబద్ధంగా అనుమతిం చబడ్డాయనీ తెలిపారు.
ఎచ్ టి (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేదనీ స్పష్టం చేశారు.
ఎచ్ టి పత్తి విత్తనాలను విత్తడం వలన
కలుపు మందులు అధికంగా వాడాల్సివస్తుందని తెలిపారు. పంట పెరుగుదల సక్రమంగా రాదని, దిగుబడి సరిగారాదని అన్నారు. రైతులకు అధిక ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా ఎచ్ టి పత్తి విత్తనాలు విత్తిన పొలాల్లో కలుపు మందుల వాడకం వల్ల భూమి సారత తగ్గడం, పర్యావరణానికి హాని కలగడం, మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.
ఎచ్ టి పత్తి విత్తనాలపై చట్టపరమైన నిబంధనలు
అనుమతి లేకుండా పత్తి విత్తనాల ఉత్పత్తి, నిల్వ, విక్రయం వినియోగం చట్ట విరుద్ధమని అన్నారు. ఇలాంటి విత్తనాలను విక్రయించినా లేదా రైతులు వినియోగించినా విత్తనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని, అనుమానం ఉన్న విత్తనాల గురించి వ్యవసాయ అధికా రులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఉచితంగా విల్ చైర్స్ పంపిణీ

శివంపేట మే 26 మన సాక్షి



శివంపేట మండలంలోని ఉసిరిక పల్లి గ్రామంలో కొట్టాల కొట్టాల గ్రామంలో ఉన్న యేసుక్రీస్తు కృప మందిరంలో పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్చి పాస్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో 18 మంది వివిధ గ్రామాలకు చెందిన వికలాంగులకు ఉచితంగా 13వేల విలువ చేసే ఒక్కొక్కటి విల్ చైర్స్ పంపిణీ చేశామని పాస్టర్ కర్ణాకర్ ఓబాల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అబ్రహం రాజు. నాయక్ జోసఫ్ లక్ష్మణ్ పాల్ ఆనంద్. నాయకులు కృష్ణారావు ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి. నాయకులు శ్రీనివాస్ గౌడ్. వికలాంగులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# మల్లన్న స్వామి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

**పటాన్చెరు, మే 26/(మన సాక్షి) :**



సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని అందూర్ గ్రామంలో శ్రీ మల్లన్న స్వామి జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ జాతరలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో జాతరలకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మికతకు మల్లన్న జాతర నిదర్శనమని తెలిపారు.

# ఐఐటీ జంక్షన్ వద్ద పనులు పరిశీలించిన సైబరాబాద్ సీపీ

**శేరిలింగంపల్లి 26 మే మన సాక్షి**



సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ మంగళవారం గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఐటీ కారిడార్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మిస్తున్న మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. సందర్భంగా సిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగ అధికారులు నిర్మాణ పనులు జరుగుతున్న తీరును సీపీ కు వివరించారు. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించిన సీపీ, నిర్మాణ కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ముఖ్య ప్రాంతాల్లో సరైన సూచిక బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని అవసరమైన ప్రాంతాలులో నియమించాలని సూచించారు. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భనలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి ఇంజినీరింగ్ విభాగ అధికారులు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్రీడలకు యువత ప్రాధాన్యతనివ్వాలి

**నాచారం,మే26,మన సాక్షి:**



యువత మద్యం మత్తు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుడు, ఎస్ఎస్ఎస్ యువసేన అధ్యక్షుడు సంతోష్ రెడ్డి అన్నారు. ప్రజ్ఞ గ్రూప్ సహకారంతో ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. టోర్నమెంట్ లో గెలిచిన జట్టులకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టోర్నమెంట్ కు సహకరించి క్రీడాకారులను ప్రోత్సహించిన నాచారం పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా సమ్మర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్ కు సహకరించిన కోచ్ లకు, క్రీడాకారులకు, వాలంటరీలకు సంతోష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# జూన్ 14న శిల్పకళా వేదికలో నృత్య ప్రదర్శన

**హైదరాబాద్‌లో పద్మభూషణ్, పద్మశ్రీ ప్రముఖ నటి శోభన అద్భుత నృత్య ప్రదర్శన**

**శేరిలింగంపల్లి , 26మే మన సాక్షి**



ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మభూషణ్ ,పద్మశ్రీ అవార్డు గ్రహీత శోభన తన అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన నృత్య ప్రదర్శన "భావ్ (భవాని )"ను హైదరాబాద్ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. వేదం ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 2026 జూన్ 14న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరగనుంది. శోభన స్వయంగా రూపకల్పన చేసి దర్శకత్వం వహించిన భావ్ (భవాని )భారతీయ సాంప్రదాయ నృత్య సౌందర్యాన్ని ఆధునిక స్టేజ్ ప్రెజెంటేషన్, సంగీతం, కథనం మరియు లయతో సమ్మిళితం చేసిన అద్భుత కళారూపం. భారతీయ సంస్కృతి, దైవభక్తి మరియు భావవ్యక్తీకరణలకు ప్రాధాన్యం ఇస్తూ రూపొందిన ప్రదర్శన ప్రేక్షకులకు విశిష్టమైన కళాత్మక అనుభూతిని అందించనుంది. ఈ సందర్భంగా వేదం ఆర్ట్ ప్రతినిధి నిఖిల్ పొలేపల్లి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం ఎప్పుడూ కళా, సంస్కృతిని ఆదరిస్తూ వస్తోంది. 'భావ్ (భవాని )' ప్రేక్షకులకు చిరస్మరణీయ అనుభూతిని అందిస్తుంది" అని తెలిపారు. టికెట్లు బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయి.

## అగ్రహారం చెరువు ఇరిగేషన్ ట్యాంక్ ను పరిశీలించిన ఎస్

**రామసముద్రం మే 26 మనసాక్షి**




అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో జరుగుతున్న జలధార జలహారతి పనులను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్ ఈ వెంకటరామయ్య, మంగళవారం నారిగాని ఫీడర్ సప్లై ఛానల్ పనులను పరిశీలించారు, అలాగే కురిజల గ్రామ సమీపంలో ఉన్న అగ్రహారం చెరువు ఇరిగేషన్ పరిశీలించారు మండల అధికారులతో మాట్లాడుతూ ప్రతి చెరువుకు నీళ్లు చేరేలా పనులు చేయాలని ఎక్కడైనా చెరువులకు మరమత్తులు చేయాలంటే మాదృష్టికి తీసుకురావాలని మండల అధికారులకు తెలియజేసారు. ఈ తనిఖీ ల్లో పాల్గొన్న ఎస్ ఈ వెంకట రామయ్య,ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ డి ఈ, ఇరుగేషన్ ఏ ఈ,ఏ పి వో మాధవి, జె ఈ రెడ్డి ఈశ్వర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ప్రారంభమైన గంగమ్మ జాతర

**ఘనంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు..**

**నేడు పగలు తిరుణాలకు సర్వం సిద్ధం.**

**రామసముద్రం మే 26 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణం, బెంగళూరు రోడ్డు, కోర్టు ఆవరణలో ఉన్న గంగమ్మ ఆలయం జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం రాత్రి తిరణాల, బుధవారం పగలు తిరుణాలకు సర్వం సిద్ధం చేశారు. ఎంతో మహిమగల, చరిత్ర కలిగిన శ్రీ కోర్టులో గంగమ్మ జాతరను ఆలయ కమిటీ నిర్వహికులు పెద్ద ఎత్తున దిగ్విజయం చేసేలా సన్నాహాలు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణాన్ని పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీ కోర్టులో గంగమ్మ అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి భక్తులకు అమ్మవారిని దర్శనం కల్పించారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కోర్టులో గంగమ్మను స్థానికులు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఈ జాతరను నిర్వహించడం జరుగుతుంది. రెండు రోజులపాటు ఎంతో కనుల పండుగగా జాతరను నిర్వహించి, బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు మంచి విందు భోజనం పెట్టడం జరుగుతుంది. బెంగళూరు రోడ్డు, సొసైటీ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, అవెన్యూ రోడ్డు ప్రాంతాల్లో భారీగా అమ్మవారి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం, రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులు విరజిల్లుతున్నాయి. మంగళవారం రాత్రి నుండి, బుధవారం రాత్రి వరకు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకోనున్నారు. మహిళలు దీలు బోనాలు మోసి మొక్కులు తీర్చారు. ఆలయం ముందు జంతుబలి ఇచ్చి కోరిన కోరికలు తీర్చాలని మొక్కుకొనున్నారు. ముఖ్యంగా తొలి పూజను జోలపాలెం కుటుంబ సభ్యులు చేయనున్నారు. అర్చకులు అమ్మవారిని బాగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలోని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరు రోడ్డుకు రెండు వైపులా దుకాణాలను ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన తినుబండారాలను అందుబాటులో ఉంచారు.

# రిటైర్డ్ ట్రెజరీ ఆఫీసర్ కు సీనియర్ సిటిజన్స్ సన్మానం



**మదనపల్లి, మే 26, మన సాక్షి :**

ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రిటైర్డ్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ రెడ్డప్పకు మదనపల్లి లోని గంగోత్రి కళ్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ముని గోపాల కృష్ణ, వారి సతీమణి ధనలక్ష్మి, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆంధ్ర పెన్షన్ పార్టీ నాయకులు తిమ్మయ్య, శ్రీనివాసులు , రెడ్డప్ప, శివ ప్రసాద్ తదితరులు ఘనంగా పూల హారం, పుష్పగుచ్చము దుస్సాలవులతో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ రెడ్డప్ప సీనియర్ సీజన్స్ లో రిటైర్డ్ గవర్నమెంట్ పెన్షనర్స్ కు ఉత్తమ సేవలు అందించినందుకు అతనిపైన గౌరవంతో సీనియర్ సిటిజన్స్ ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ కు రిటైర్డ్ గవర్నమెంట్ పెన్షనర్స్ కు రెడ్డప్ప సేవలను ప్రశంసిస్తూ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ముని గోపాల కృష్ణ ప్రసంగించారు.

## కేసీ పల్లె ఫీడర్ ఛానల్ పనులు తనిఖీ

**రామసముద్రం మే 26మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని కేసీ పల్లె గ్రామ పంచాయతీ చెరువుల ఫీడర్ ఛానల్ పనులను అంబుడ్స్ మన్ అధికారి శ్రీరాములు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు,అలాగే మండలం లోని ఊలపాడు గ్రామ పంచాయతీ లో ఉపాధి హామీ పథకంద్వారా జరుగుతున్న చేపల ఫారం ఫండ్ పనులను పరిశీలించారు, వారు మాట్లాడు తూ కూలీలు ఎండలు ఎక్కువగా ఉన్నాయని వడ దెబ్బలు తగలు కుండా జాగ్రత్తలు తీసుకోవాలని నెత్తిన కాటన్, టోపీ లు గాని తలపాగా ధరించికోవాలని, గ్లూకోస్, నిమ్మరసం వెంట తీసుకురాలని వారికి తెలియజేసారు,ఈ తనిఖీ లో పాల్గొన్న ఏ పీ వో మాధవి, జె ఈ రెడ్డి ఈశ్వర్,ఫీల్డ్ అసిస్టెంట్ లు రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ.



**జగిత్యాల మే 26 మన సాక్షి**

కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ. మంగళవారం పురస్కరించుకుని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 20 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఉప ప్రధాన అర్చకులు మారుతి ప్రసాద్, అరుణ్, అనిల్, లక్ష్మణ్ ప్రసాద్ భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగాఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# డా తులసి రమణా చార్యుల కు ఘన సన్మానం.

**మేడ్చల్ మల్కాజిగిరి మే 26 మన సాక్షి**



అవధాన విద్యా వికాస పరిషత్ చే డా తులసి రమణా చార్యుల కు ఘన సన్మానం. దర్శనం వార్త మాస పత్రిక వారి ఆధ్వర్యంలో అవధాన విద్యా వికాస పరిషత్ 5 వ అవధాన పద్య శిక్షణ శిబిరం సమాపనోత్సవం సందర్భంగా ఏకదిన సంపూర్ణ శతావధాన కార్యక్రమం ను శతావధాన తిలక బ్రహ్మశ్రీ ఉప్పలధడియం భరత శర్మ ఏకధాటిగా పూర్తి చేసి ఘన కీర్తి గడించారు. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి ప్రాంతానికి చెందిన కవి, రచయిత, అర్చకులు డా తులసి వెంకట రమణా చార్యులు అవధాన లో వర్ణన ఆవృతం లో పాల్గొని చక్కటి ప్రశ్నలతో అపారమైన జ్ఞాన సంపద కలిగి అవధానుల ప్రశంశలు, పలువురి ప్రశంశలు అందుకొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ అవధాన విద్యా వికాస పరిషత్ వ్యవస్థాపకులు మరమాముల దత్తాత్రేయ శర్మ, దర్శనం మాస పత్రిక ప్రధాన సంపాదకు ల మరుమాముల వెంకట రమణా ఆధ్వర్యంలో సెయింట్ మార్క్స్ స్కూల్ దీనదయాళ్ లో ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న కవుల ను నిర్వాహకులు ఘనంగసన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి కి చెందిన కవయిత్రి మూర్తి శ్రీదేవి, కవులు శిఖా గణేష్, భోగయ్య గారి చంద్ర శేఖర్ శర్మ, పరిమి సత్య మూర్తి తదితర ప్రముఖ సాహితీ మూర్తులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి, మహాగణపతికి ప్రత్యేక పూజలు

**రామసముద్రం మే 26 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని బజారు వీధిలో కొలువైన అతిపురాతన శ్రీ ఆంజనేయస్వామి, మహా గణపతి ఆలయాల్లో మంగళవారం ఆలయ పూజారి కులశేఖర్ బటర్ ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ శుద్ధి చేసి స్వామివారికి జలాభిషేకం పన్నీరు, గంధం, పాలు, పెరుగు లతో పంచామృతాభిషేకాలు, తమలపాకులహారం, పలురకాల పుష్పాలతో స్వామి వారిని అలంకరణ చేసి స్వామివారికి మంగళ హారతులు పట్టి భక్తులకు స్వామి వారిని దర్శనకల్పించి, స్వామిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు కులశేఖర్ బటర్ స్వామి తీర్థ ప్రసాధాలు అందజేశారు.

# ప్రశాంతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలి


**రామసముద్రం మే 26 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని ముస్లిం లు ప్రశాంతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఎస్సై హృషికేశవ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో హిందూ, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా శాంతియుత వాతావరణలో పండుగను జరుపుకోవాలన్నారు. అదేవిధంగా శాంతి భద్రతలకు అటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్సై హృషికేశవ రెడ్డి,చలపతి నాయుడు,రామకృష్ణ మ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు,మైనారిటీ నాయకులు చాంద్,బాషా, బిజెపి పార్టీ అధ్యక్షులు ఇంజం ఆనంద్, డాక్టర్ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

**వెల్దండ మే 26 మన సాక్షి:**



కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 82 మంది లబ్ధిదారులకు చెక్కులు రూ.లక్ష 116 రూపాయలు ఒక్కొక్క చెక్కు మొత్తం 82 లక్షల 9 512 రూపాయలు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు భూపతిరెడ్డి, డీసీసీ కార్యదర్శి మోతిలాల్ నాయక్,వెల్దండ మండల పార్టీ అధ్యక్షులు హరికిషన్ నాయక్, కిసాన్ సెల్ పర్వత్ రెడ్డి, సర్పంచులు రాందాస్ నాయక్, తారా సింగ్, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ,గన్యా నాయక్, లక్ష్మణ్ స్వామి,బాగ్యమ్మ ఫుల్ సింగ్ నాయక్ ,గున్నెళ్ళ శీను వాసులు ,కొత్ర సర్పంచ్ శారద చెన్నయ్య, ప్రసాద్, రాజశేఖర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ నుంచి రక్షించాలి

**సిపిఐ ఎంఎల్ నాయకులు పేర్ల నాగయ్య.**

**తుంగతుర్తి మన సాక్షి, మే 26.**

తుంగతుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసి 20 రోజులు అయినప్పటికీ కాంటాలు వేయకుండా రైతులను ఇబ్బంది పాలు చేస్తున్నారని పలు మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడదెబ్బ నుంచి ప్రజలను రక్షించే కార్యక్రమాలను అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాసులైన తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేరు నాగయ్య మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత సంవత్సరం వాతావరణంలో అనూహ మార్పులు చోటుచేసుకుని గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. గత మూడు రోజుల నుండి 45 డిగ్రీలకు పైగానే వేడి తాపం పెరగడంతో వృద్ధులు ఈ వేడికి తట్టుకోలేక చనిపోతున్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో పనికి ఆహార పనులలో ఎండకు తట్టుకోలేక జ్వరాలతో హాస్పిటల్లో గుల్కోసుల పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కావున ఎలాంటి పనులకు 11 దాటిన తర్వాత వెళ్లకుండా మండలాలలోని ప్రజలు రైతులు సాయంత్రం నాలుగు గంటల వరకు వేడి చాపానికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకొని చల్లటి నీళ్లు మజ్జిగ కొబ్బరి నీళ్లు తాగుతూ నీడ పట్టులో పేద ప్రజలు ఉండాలని వారికి పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలోని వార్డులలో ఓఆర్ఎస్ పొట్లాలను పంచి అవగాహన తెలియపరచి వారిని రెండు ఎంతో




పనులు ఉన్నప్పటికీ పొద్దుగాల లేచి 10 గంటల లోపు ఇంటికి వెళ్లి నీడపట్టులో ఉండాలని వారికి తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కూలి చేసుకొని బ్రతికే వారికి కనీసం 15 రోజులకు సరిపోను నిత్యవసర సామాగ్రిని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే ఇంటింటికి మజ్జిగ ప్యాకెట్లను అందించే కార్యక్రమం చేపట్టాలని కోరారు వడదెబ్బతో చనిపోయిన వ్యవసాయ కార్మికులకు కూలీలకు తక్షణమే సహాయం కింద 50,000 లతోపాటుఎనిమిది లక్షల ఎక్స్గ్రేషియా అందించాలని వారు డిమాండ్ చేశారు

# జోనల్ కమిషనర్‌ను కలిసిన రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి 26 మే మన సాక్షి**

శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్ అమిత్ ని మంగళవారం శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్‌కు సంబంధించిన పలు ప్రజా సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

# వారి కోసం ఎస్‌బీఐ స్పెషల్ స్కీమ్.. ఎక్కువ వడ్డీ దీంట్లోనే..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్ల కోసం ఎన్నో రకాల స్కీమ్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తూ స్పెషల్ పథకాలు కూడా ప్రవేశపెట్టింది. వీటిల్లో అమృత్ కలశ్, సర్వోత్తమ్ ఎఫ్‌డీ, ఎస్‌బీఐ వీకేర్ వంటి స్కీమ్స్ వంటివి ఉన్నాయి. సీనియర్ సిటిజెన్ల కోసం ఉద్దేశించిన వీకేర్ పథకం గురించి ఇప్పుడు చూద్దాం.
సీనియర్ సిటిజెన్ల కోసమే భారతీయ స్టేట్ బ్యాంక్ ఒక స్పెషల్ స్కీమ్ తీసుకొచ్చింది. అదే వీకేర్. సీనియర్ సిటిజెన్లకు ఈ పథకంలో భాగంగా రెగ్యులర్ డిపాజిట్లతో పోలిస్తే అధిక వడ్డీ అందిస్తుంది. 5 సంవత్సరాల నుంచి పదేళ్ల వ్యవధి డిపాజిట్లపై ప్రస్తుతం ఈ స్కీంలో ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తోంది ఎస్‌బీఐ. ఈ స్కీమ్స్‌ను పరిమిత కాలవ్యవధితో తీసుకొస్తుంటాయి. ఇందులో చేరేందుకు గడువు ముగుస్తోంది. గతంలో కస్టమర్ల డిమాండ్ నేపథ్యంలో పలుమార్లు ఈ పథకాల గడువుల్ని పొడిగించిన ఎస్బీఐ.. మరి ఇప్పుడు పొడిగిస్తుందో లేదో చెప్పడం కష్టం. ప్రస్తుతానికి అయితే 2024, మార్చి 31 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంది. ఈ మేరకు బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంది. ఫ్రెష్ డిపాజిట్స్ సహా రెనివల్ చేసుకునేవారికి కూడా ఈ స్కీమ్ వర్తిస్తుందని ఎస్బీఐ వెల్లడించింది.
సాధారణంగా ఎస్‌బీఐ సహా ఇతర ఏ బ్యాంకులు అయినా జనరల్ సిటిజెన్లతో పోలిస్తే సీనియర్ సిటిజెన్లకు 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ ఎక్కువ అందిస్తుంటాయి. కూడా అలాగే ఆఫర్ చేస్తోంది. ఈ బ్యాంకు ఇప్పుడు సీనియర్ సిటిజెన్లకు వారం రోజుల నుంచి 10 సంవత్సరాల వ్యవధి డిపాజిట్లపై కనిష్ఠంగా 4 శాతం నుంచి 7.50 శాతం వరకు వడ్డీ అందిస్తోంది. అత్యధికంగా ఎస్బీఐ వీకేర్ స్పెషల్ ఎఫ్‌డీపైనే 7.50 శాతం వడ్డీ అందిస్తోంది. వీకేర్ స్పెషల్ ఎఫ్డీ టెన్యూర్ 5 నుంచి 10 ఏళ్లుగా ఉంటుంది. ఈ టెన్యూర్ డిపాజిట్‌పైనే అత్యధిక వడ్డీ అందుతోంది. దీంట్లో రూ. లక్ష జమ చేస్తే ఎంతొస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.
ఉదాహరణకు ఎస్బీఐ వీకేర్ స్కీమ్‌లో ఐదేళ్ల టెన్యూర్‌కు ఇప్పుడు రూ. లక్ష డిపాజిట్




చేసినట్లయితే ప్రస్తుతం ఉన్న 7.50 శాతం వడ్డీ లెక్కన మెచ్యూరిటీకి మీ చేతికి రూ. 44,995 వడ్డీ వస్తుంది. మీ చేతికి మొత్తం రూ. 1,44,995 అందుతుంది. అదే రూ. 5 లక్షలు డిపాజిట్ చేసినట్లయితే వడ్డీతో కలిపి మీ చేతికి రూ. 7,24,974 వస్తుంది.
ఇక ఈ బ్యాంకుల గురించి చూస్తే సీనియర్ సిటిజెన్లకు 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై 4 శాతం వడ్డీ, 46 రోజుల నుంచి 179 రోజుల పై 5.25 శాతం వడ్డీ వస్తుంది. 180-210 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 6.25 శాతం వడ్డీ, 211 రోజుల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఏడాది నుంచి రెండేళ్ల డిపాజిట్లపై 7.30 శాతం, రెండేళ్ల నుంచి మూడేళ్ల డిపాజిట్లపైనా 7.50 శాతం వడ్డీ అందుతోంది. ఎస్‌బీఐ ఇతర స్పెషల్ స్కీమ్స్ విషయానికి వస్తే 400 రోజుల టెన్యూర్‌తో ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం ఉంది. దీంట్లో రెగ్యులర్ సిటిజెన్లకు 7.10 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.60 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఈ స్కీం లాస్ట్ డేట్ కూడా 2024, మార్చి 31గానే ఉంది. ఎస్‌బీఐ గ్రీన్ డిపాజిట్లను కూడా ఆఫర్ చేస్తోంది. ఇందులో సీనియర్ సిటిజెన్లకు 1111, 1777, 2222 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై వరుసగా 7.15 శాతం, 7.15 శాతం, 7.40 శాతం వడ్డీ వస్తోంది. సీనియర్ సిటిజెన్లకు ఎస్‌బీఐ సర్వోత్తమ్ ఎఫ్‌డీ కింద ఏడాది టెన్యూర్‌పై 7.60 శాతం, రెండేళ్ల టెన్యూర్‌పై 7.90 శాతం వడ్డీ అందుతోంది.

# బాలికలకు ఉచితంగా సైక్లింగ్ ప్రారంభం



**తుంగతుర్తి మన సాక్షి మే 26.**

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా మండల సమైక్య ఆధ్వర్యంలో ప్రజాపాలనగిరి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ జయసుధ పవర్ మహిళా శక్తి కార్యక్రమంలో సంఘాల బాలికలకు ఉచితంగా సైక్లింగ్ నేర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్నేహ సంఘాల బాలికలకు సాధికారత కల్పించే ప్రభుత్వ పథకం ఇది 18 సంవత్సరాల వయసు గల కిషోర్ బాలికల ఆరోగ్యం పోషణ మరియు నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందని అలాగే స్నేహ సంఘాల బాలికలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోగలరని కోరుతున్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హరిచంద్ర ప్రసాద్ సిబ్బంది ఎంపీడీవో ఏపీఎం బలి శాఖల అధికారులు మహిళా సమైక్య సంఘాల మహిళా సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సిబిల్ స్కోరు లేకున్నా ఈజీగా రుణం పొందొచ్చు

భారత్‌లోని అన్ని బ్యాంకుల్లో దాదాపు అన్ని రకాల లోన్లు అందుబాటులో ఉంటాయి. హోం లోన్, వెహికిల్ లోన్, పర్సనల్ లోన్ ఇలా ఏది కావాలన్నా సిబిల్ స్కోరు అనేది తప్పనిసరి అన్న సంగతి తెలిసిందే. అయితే సిబిల్ స్కోరు లేకుండా కూడా పర్సనల్ లోన్ పొందే అవకాశం ఉంటుందా. క్రెడిట్ స్కోరు లేకున్నా కొన్ని ప్రత్యేక అంశాల్ని పరిగణనలోకి తీసుకొని లోన్లు అందిస్తుంటాయి. అత్యవసర సమయాల్లో డబ్బు కావాలంటే పర్సనల్ లోన్లు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పొచ్చు.
తక్షణమే లోన్ కావాలంటే.. బ్యాంకులు మొదట చెక్ చేసేది అర్హతలు. అర్హతల విషయానికి వస్తే మొదట మంచి ఆదాయం ఉండాలి. మంచి సిబిల్ స్కోరు ఉండాలి. ఏ బ్యాంక్ అయినా లోన్ ఇచ్చే ముందు.. సదరు దరఖాస్తుదారు క్రెడిట్ హిస్టరీ (రుణ చరిత్ర) తెలుసుకుంటుంది. గతంలో మీరు తీసుకున్న లోన్ వివరాలు, గత చెల్లింపుల చరిత్ర, క్రెడిట్ కార్డుల వినియోగం ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని లోన్




ఇవ్వాలా వద్దా అని చూస్తుంటాయి. అయితే సిబిల్ స్కోరు లేకుండా లోన్ పొందొచ్చా? ఈ ఛాన్స్ ఉంది. అదెలాగో చూద్దాం.
సిబిల్ స్కోరు లేకున్నా లోన్ ఇవ్వాలంటే బ్యాంకులు రిస్క్‌గా భావిస్తాయి. అయితే కొన్ని బ్యాంకులు, ఇతర నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు మాత్రం సిబిల్ స్కోరు లేకున్నా లోన్ ఆఫర్ చేస్తుంటాయి. దీని కోసం కొన్ని ప్రత్యేక పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి. ఇక్కడ మీరు లోన్ తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని.. మీ శాలరీ స్లిప్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్‌ను బట్టి అంచనా వేసి లోన్ మంజూరు చేయొచ్చు. మీకు ఏదైనా బ్యాంకులో శాలరీ అకౌంట్ ఉంటే.. మీ ఆర్థిక లావాదేవీల కు సంబంధించి రికార్డులు, వివరాలు వాటి దగ్గరే ఉంటాయి. ఇక్కడ ప్రీఅప్రూవ్డ్ లోన్లు లభించే అవకాశం ఉంటుంది. లోన్ ప్రాసెస్ కూడా వేగంగా జరుగుతుంది.
కొన్ని రుణదాతలు సంప్రదాయ క్రెడిట్ స్కోరు కాకుండా ఇతర పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి. మీ డిజిటల్ బ్యాంకింగ్ హిస్టరీ కావొచ్చు లేదా మీరు యుటిలిటీ బిల్స్ పేమెంట్ చేయడం వంటివాటిని పరిశీలిస్తాయి. మీ క్రెడిట్ స్కోరుతో పని లేకుండా గ్యారంటర్ సాయంతో లోన్ పొందొచ్చు. మీరు గ్యారంటర్‌గా పెట్టుకున్న వ్యక్తి రుణ చరిత్ర బాగుంటే సరిపోతుంది. మీకు సరైన క్రెడిట్ స్కోరు లేకపోయినా.. స్థిర ఆదాయం ఉందని నిరూపించగలిగితే రుణ సంస్థలు లోన్లు ఆఫర్ చేస్తాయి. దీని కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆదాయపు పన్ను రిటర్న్లు వంటివి సమర్పించాలి. ప్రధానంగా మీరు ఆర్థిక



క్రమశిక్షణ కలిగి ఉన్నారా లేదా అనే విషయమే చూస్తాయి.
ఇబ్బందులివే.. క్రెడిట్ స్కోరు చెక్ చేయకుండా రుణ సంస్థలు లోన్లు ఇచ్చేముందు మీరు కొన్ని అంశాల్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడ వడ్డీ రేట్లు ఇతర వాటితో పోలిస్తే ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. క్రెడిట్ స్కోరు 750 కంటే మెరుగ్గా ఉంటే చాలా బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే లోన్లు వస్తాయి. సిబిల్ స్కోరు లేని సమయంలో రుణ దాతలు.. టెన్యూర్ ఎక్కువ కాలం ఇవ్వవు. అంటే తక్కువ కాలంలో నెలవారీగా పెద్ద మొత్తంలో ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఆర్థికంగా ఇబ్బందుల్ని సృష్టించే అవకాశం ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజులు సహా ఇతర టర్మ్స్ అండ్ కండీషన్స్ పేరిట ఎక్కువ రుసుములు వసూలు చేసే రిస్క్ ఉంటుంది.

# ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి




**మిర్యాలగూడ, మే 26, మన సాక్షి :**

తెలంగాణలో భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా రైతులకు ప్రత్యేకమైన 12 అంకెల డిజిటల్ ఐడీ లభిస్తుంది. దీనిని ఆధార్ కార్డు తరహాలో ఉపయోగించుకోవచ్చు. ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలురిజిస్ట్రేషన్ ఎందుకు ముఖ్యమని వివరిస్తూ భవిష్యత్తులో రైతు బంధు, పీఎం కిసాన్, పంటల బీమా, విత్తనాలు మరియు ఎరువులపై సబ్సిడీలు వంటి ఏ ప్రభుత్వ పథకం పొందాలన్నా ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

**ఎక్కడ నమోదు చేసుకోవాలి?**

గ్రామాల్లోని రైతు వేదికల ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఓ) ఈ నమోదును ఉచితంగా చేస్తారు. మీ-సేవా కేంద్రాల్లో చేసుకోవచ్చు అన్నారు. కావాల్సిన పత్రాలు: పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, రైతు బ్యాంకు ఖాతా వివరాలు అవసరం ఉంటుందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఓలు) ఎండి.షఫీ, గోపి, రమేష్, రైతులు యాదమ్మ, వీరయ్యలు ఉన్నారు.

# ఇన్వెస్టర్ల సంపదను డబుల్ చేసిన మ్యూచువల్ ఫండ్లు ఇవే..

మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ వారి సంఖ్య ఏటా పెరుగుతోందని చెప్పొచ్చు. గత నెలలో ఏకంగా రూ. 26,866 కోట్ల మేర పెట్టుబడులు రావడం విశేషం. న్యూ ఫండ్ ఆఫర్, థీమ్యాటిక్ ఫండ్స్ దీంట్లో కీలక పాత్ర వహించాయి. అయితే ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో గత 3 సంవత్సరాల వ్యవధిలో ఇన్వెస్టర్ల సంపదను రెట్టింపు చేసిన స్కీమ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఈక్విటీ మార్కెట్లలో దేశీయ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతున్న క్రమంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. గత నెలలో రూ. 26,866 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జనవరి వచ్చిన రూ. 21 వేల కోట్లతో పోలిస్తే ఫిబ్రవరిలో 23 శాతం పెరిగాయి. ఇక మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ ఫిబ్రవరి చివరి నాటికి రూ. 54,54,214.13 కోట్లకు పెరిగింది. ముఖ్యంగా సిప్ ద్వారా వస్తున్న పెట్టుబడులే పెరిగాయి. కొత్త సిప్ అకౌంట్లు గత నెలలో 49,79,431 ప్రారంభం కావడం విశేషం. మ్యూచువల్ ఫండ్లతో బంపర్ రిటర్న్లు వస్తాయని తెలిసిందే. ఇక్కడ కాంపౌండ్ ఇంట్రెస్ట్ కీలక పాత్ర పోషిస్తుంటుంది. వడ్డీపై వడ్డీ రావడంతో ఏటా రాబడి పెరుగుతూనే ఉంటుంది. స్టాక్ మార్కెట్లతో పోలిస్తే ఇక్కడ రిస్క్ కాస్త తక్కువ ఉంటుందని చెప్పొచ్చు. అందుకే దీంట్లో ఎక్కువగా సిప్ (క్రమానుగత పెట్టుబడులు) పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇప్పుడు గడిచిన మూడేళ్లలో పెట్టుబడిదారుల సంపదను రెట్టింపు చేసినటువంటి ఫండ్ స్కీమ్స్ ఏమున్నాయో చూద్దాం.




క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్.. మ్యూచువల్ ఫండ్లలో క్వాంట్ స్కీమ్‌కు మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువ రిటర్న్లు ఇందులో వస్తుంటాయి. 3 సంవత్సరాల వ్యవధిలో క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ 196 శాతం రిటర్న్లు అందించింది. అంటే ఇక్కడ రూ. లక్ష పెట్టుబడి రూ. 2.95 లక్షలుగా మారింది.
క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్.. ఇది మూడేళ్ల కాలంలో 158 శాతం రిటర్న్లు అందించగా.. రూ. లక్ష పెట్టుబడిని రూ. 2.58 లక్షలు చేసింది. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ - 3 సంవత్సరాల్లో ఈ స్కీమ్ 144 శాతం రిటర్న్లు అందించగా.. లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రూ. 2.43 లక్షలొచ్చాయి.
నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్- ఇది 143 శాతం రిటర్న్లు ఇచ్చింది. లక్ష పెట్టుబడిని మూడేళ్లలోనే రూ. 2.43 లక్షలుగా మలిచింది. స్మాల్ క్యాప్ ఫండ్ మూడేళ్లలో 138 శాతం రిటర్న్లు ఇవ్వగా లక్షకు రూ. 2.38 లక్షలొచ్చాయి.
క్వాంట్ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ కూడా 3 సంవత్సరాల కాలంలో 134 శాతం పెరగ్గా.. లక్ష పెట్టుబడిని రూ. 2.33 లక్షలు చేసింది.
మోతీలాల్ ఓస్వాల్ మిడ్ క్యాప్ ఫండ్ 132 శాతం రిటర్న్లు అందించగా.. లక్ష పెట్టుబడిపై రూ. 2.32 లక్షలొచ్చాయి. స్మాల్ క్యాప్ ఫండ్‌లో రూ. లక్షపై రూ. 2.26 లక్షలొచ్చాయి. అంటే ఇక్కడ 127 శాతం రిటర్న్లు మూడేళ్లలోనే పొందారు ఇన్వెస్టర్లు. క్వాంట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్- 3 సంవత్సరాల కాలంలో ఈ మ్యూచువల్ ఫండ్ స్కీమ్ 125 శాతం లాభాలు ఇవ్వగా.. రూ. లక్ష పెట్టినోళ్లకు రూ. 2.25 లక్షలు అందాయి. ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్ 3 ఏళ్లకు 122 శాతం రిటర్న్లు అందించగా లక్ష పెట్టుబడిని రూ. 2.21 లక్షలుగా మలిచింది.

# మహాసిమెంట్ కార్మికుల ఆందోళన

అనకాపల్లి: ఎన్నాళ్లు చేసిన అదే కూలి ? అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా ? అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం తీరును నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్దతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.